క్లుప్తంగా

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



కేశంపేట: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

కేశంపేట: డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో నాలుగు రోజులకు చేరింది. ఈ మేరకు వారు సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య, పారేష, యాదయ్య, జంగయ్య, అంజయ్య, చంద్రయ్య, భిక్షమయ్య, రాములు, పద్మమ్మ, నర్సమ్మ, పెంటమ్మ, స్వరూప, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయండి

పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సతీష్

షాబాద్: బీఎస్పీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ గొల్ల సతీష్, చేవెళ్ల అసెంబ్లీ ఉపాధ్యక్షుడు కర్రె శ్రీశైలం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్ సారథ్యంలో రాష్ట్రంలో బహుజన రాజ్యస్థాపన ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల, షాబాద్ మండలాల అధ్యక్షులు వెంకటేష్, చందు, నాయకులు రాంచందర్, శ్రీనివాస్, ప్రవీణ్, రఘు, నందీశ్వర్, ప్రదీప్, శంకర్, కృష్ణ, రాంబాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం

ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి



ఏబీవీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తూరు: విద్యార్థుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడే ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ మాత్రమేనని ఈ సంఘం మండల కన్వీనర్ నరేశ్‌చారి అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తూరులో ఆదివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేశ్‌చారి మాట్లాడుతూ.. 1949 జూలై 9న ఆవిర్భవించిన ఏబీవీపీ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా పేరొందిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ కుమార్, శేఖర్, సుమిత్, సుదర్శన్, నీలకంఠం, రాఘవేందర్, తేజ, విష్ణు, జశ్వంత్ పాల్గొన్నారు.

టీపీసీఎస్ మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు



నియామకపత్రం అందజేస్తున్న నర్సింలు

షాబాద్: తెలంగాణ ప్రజా చైతన్య సమితి(టీపీసీఎస్) చేవెళ్ల మండల అధ్యక్షుడిగా కొత్తకురుమ ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింలు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీపతి శివకుమార్, మల్లేశ్ గౌడ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జంగారెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఫిల్మ్ సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు నక్కలపల్లి జంగారెడ్డి, ఇంటర్ ప్రైవేట్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్, అన్నారు. నక్కలపల్లి గ్రామంలో మల్లపురం మల్లేశ్ కురుమ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆదివారంతో టోర్నమెంట్ ముగియడంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. విజేత జట్టుకు రూ.5వేల నగదు, రన్నరప్ జట్టుకు రూ.2,500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, టోర్నమెంట్ నిర్వాహకులు కురుమ మల్లేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, బట్టు నర్సింహ, మల్లయ్య, భీమయ్య, రాజుగౌడ్, రవికుమార్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

- కలగానే మిగిలిన జూనియర్ కళాశాల ఏర్పాటు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. కళాశాల అందుబాటులో లేక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. దూర ప్రాంతాల్లో ప్రైవేట్ కాలేజీలో చదివించడం భారమవుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పలువురు పేదలు పదో తరగతితోనే చదువు ఆపేస్తున్నారు. కళాశాల ఏర్పాటు గురించి విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని వాపోతున్నారు. పలు మార్లు మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్తూరు: అభివృద్ధిలో దూసుకుపోతున్న మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, వృత్తి విద్యా కేంద్రాలు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పీ అండ్ జీ, జాన్సన్ అండ్ జాన్సన్ పలు బహుళ జాతి పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. కాగా ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేందుకు కావాల్సిన వృత్తి విద్యలను అభ్యసించేందుకు ప్రభుత్వ కళాశాలలు అందుబాటులో లేవు. స్థానిక విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ(పారిశ్రామిక శిక్షణ కేంద్రం) ఏర్పాటు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు అధికారులను, పాలకులను కోరుతున్నా స్పందన కరువైంది. దీంతో ఇక్కడి విద్యార్థులు ఉన్నత విద్య కోసం హైదరాబాద్, శంషాబాద్, షాద్‌నగర్‌తో తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. మండలంలోని సిద్ధాపూర్, పెంజర్ల, కొడిచర్ల, ఎస్‌బీపల్లి, తిమ్మాపూర్, ఇన్ముల్‌నర్వతో పాటు పలు గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు కళాశాలల నిమిత్తం ఆయా ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు.

స్పందన కరువు

ఐదేళ్లుగా మండల కేంద్రంలో వృత్తి విద్యాకేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు, పాలకులు అధికారులకు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. సభలు, సమావేశాల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, మంత్రుల జూనియర్ కళాశాల ఏర్పాటు గురించి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మండల కేంద్రంలో వృత్తివిద్యాకేంద్రం, జూనియర్ కళాశాల లేక అర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు



చెందిన విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునే పరిస్థితులు లేక పదో తరగతితోనే చదువుకు దూరమవుతున్నారు. మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు బస్సు సర్వీసులు లేక వ్యయప్రయాసలకోరుస్తున్నారు. బస్సు సర్వీసులు పెంచాలని పలుమార్లు విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నాలు చేపట్టారు. వాస్తవంగా మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం అన్ని సౌకర్యాలు మెండుగా ఉన్నప్పటికీ ప్రభుత్వ స్థలం కొరత ఉందనే సాకుతో అధికారులు, పాలకులు వీటి గురించి పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చొరవ తీసుకోవాలి



కొత్తూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వృత్తివిద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏళ్ల నుంచి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతున్నాం. రెండేళ్ల క్రితం కళాశాల ఏర్పాటుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి కార్పస్ ఫండ్ రూ.20 వేలు జమచేశాం. పాలకులు, అధికారులు చొరువ తీసుకుంటే కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమమవుతుంది.

– నరేశ్‌చారి, ఏబీవీపీ నాయకుడు, కొత్తూరు

ప్రతిపాదనలు పంపించాం



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వృత్తివిద్యా కేంద్రం(ఐటీఐ) ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నా. ప్రస్తుతం రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తుండడంతో అక్కడే ఇంటర్ వరకు విద్యబోధన జరుగుతుంది.

– అంజయ్యయాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మూడోసారి గెలిపిస్తాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, సజ్జన్‌పల్లి, కంచెమోనీగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో పల్లె పల్లెకు కేఎస్.రత్నం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 60గ్రామాల్లో పర్యటించామన్నారు. నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాలలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భాస్కర్, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మోత్కుపల్లి సర్పంచ్ రత్నం, నాయకులు కొండల్‌రెడ్డి, చిరాగ్ మోహన్‌గౌడ్, మాధవరెడ్డి, కొండల్‌రెడ్డి, మహేందర్, నీలకంఠం, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆరే సీఎం

మొయినాబాద్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆరే తెలంగాణ రాష్ట్రానికి మూడోసారి సీఎం అవుతారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పల్లె



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో పర్యటిస్తున్న కేఎస్.రత్నం

పల్లెకు రత్నం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో ఆయన పర్యటించారు. ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి అందుతున్నాయన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని.. మరోసారి కేసీఆర్‌నే ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సారి చేవెళ్ల టికెట్ తనకే వస్తుందని.. ఎమ్మెల్యేగా గెలుస్తున్నానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోత్కుపల్లి సర్పంచ్ రత్నం, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌గౌడ్, నాయకులు హన్మంత్‌రెడ్డి, మాధవరెడ్డి, నీలకంఠం, మహేందర్, రవీందర్ తదితరులున్నారు.

బ్రహ్మ గర్జనకు తరలిన బ్రాహ్మణులు

చేవెళ్ల: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన బ్రహ్మ గర్జన సభకు చేవెళ్ల ప్రాంతంనుంచి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి చేవెళ్ల, పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌కు చెందిన బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో బ్రహ్మగర్జనకు బయలుదేరారు. తెలంగాణ బ్రాహ్మణ సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి వైభవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రావు, మాజీ కార్యదర్శి సృజన కుమార్, ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలకు చెందిన వారికి చేవెళ్లలో అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం సభకు బయలు దేరి వెళ్లారు.



బ్రహ్మ గర్జనకు వెళ్తున్న బ్రాహ్మణులు

'కళలను ప్రోత్సహిద్దాం'

తలకొండపల్లి: కనుమరుగవుతున్న కళలను ఆదరించాలని సర్పంచ్ కుమార్ అన్నారు. చంద్రధనలో హన్‌మాన్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి వీధి నాటకం శనివారం రాత్రితో ముగిసింది. ఆదివారం సర్పంచ్ వ్యక్తిగతంగా కళాకారులకు రూ.11,116 ప్రోత్సాహకం అందజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణి, రాజుయాదవ్, వెంకటేశ్, కృష్ణవేణి, రేణుక, యాదయ్య, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలను విస్తృతం చేయాలి

మంచాల: మండల పరిధిలోని వీఆర్‌వన్ ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించాలని ఎన్‌ఆర్‌ఐ కుకుడాల సందీప్‌రెడ్డి (అమెరికా) అన్నారు. మండల పరిధి లోని తాళ్లపల్లిగూడ గ్రామంలో ఆదివారం ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అనంతరం సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు వీఆర్‌వన్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పేద విద్యార్థులకు, దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు 13 వాటర్ ఫిల్టర్ల ఏర్పాటు వంటివి చేశామన్నారు. దివ్యాంగులకు, అంధులకు చేతి కర్రలు, వినికిడి యంత్రాలు అందించారు. వీఆర్‌వన్ ఫౌండేషన్ నూతన కమిటీ చైర్మన్‌గా కుకుడాల అజితారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భిక్షపతి, సభ్యులు పాల్గొన్నారు.

సరికొత్తగా సాగు.. లాభాలు బాగు

- డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతులవైపు అన్నదాత చూపు
- రైతుల్లో పెరుగుతున్న అవగాహన

సాగునీటికి నోచుకోక వ్యవసాయాన్ని వదిలేసిన రైతులు.. సాగునీటి లభ్యత పెరగడంతో ఎక్కువ శాతం వరి సాగుపై దృష్టి సారించారు. కూలీల కొరత రైతులను వేధిస్తోంది. దీంతో నారుమడి అవసరం లేకుండా పంటకాలాన్ని తగ్గించడానికి వెదజల్లే పద్ధతిలో, డ్రమ్‌సీడర్ వరి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

షాబాద్: నారుపోయడం, నీరు పెట్టడం.. నాట్లు వేయించడం.. ఇవన్నీ పాతతరం వరి సాగు పద్ధతి.. రైతులు ఆధునిక వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు. వరి సాగులో కూలీలు, యంత్రాల కొరత అధిగమించడానికి, పెట్టుబడి తగ్గించుకోవడానికి, అధిక దిగుబడి సాధించేందుకు సాంకేతిక పద్ధతులు వినియోగిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. రోజు రోజుకూ సాగుపై చేసే ఖర్చు పెరగడం, మరోవైపు కూలీల కొరత సమస్యలను అధిగమించేందుకు రైతులు డ్రమ్ సీడర్‌ను వినియోగిస్తున్నారు. ఈ పద్ధతుల ద్వారా రైతులకు తక్కువ ఖర్చవుతుంది. దీంతో రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

వానాకాలం సీజన్‌లో మండల రైతులు 15వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఇందులో 30 శాతం డ్రమ్‌సీడర్, 30 శాతం వెదజల్లే పద్ధతిలో పంట సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు.



ముద్దెంగూడలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతులు

డ్రమ్‌సీడర్‌ను రూ.4 నుంచి రూ.5వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వెదజల్లడంతో నిర్ధిష్టమైన అంతరంలో సాళ్లు వస్తాయి. డ్రమ్‌సీడర్ విధానంతో 20 రోజుల ముందే పంట చేతికి వస్తుంది. అదనంగా 3 నుంచి 4 బస్తాల దిగుబడినిస్తుంది. వినూత్న పద్ధతిలో చేపడుతున్న సాగు విధానాలపై రైతులు మొగ్గ చూపుతున్నారు.

అధిక దిగుబడులు



ఇదివరకు వరి సాగు చేయాలంటే కూలీల కొరతతో రైతులకు ఇబ్బందులు ఉండేవి. వ్యవసాయ అధికారుల సూచనలతో డ్రమ్‌సీడర్ విధానంతో వరి సాగు చేస్తున్నాం. దీంతో ఖర్చు తగ్గి కూలీల సమస్య తీరుతోంది. సమయం తక్కువ, అధిక దిగుబడులు వస్తాయి.

– కూర వెంకటయ్య, రైతు ముద్దెంగూడ

సాగు సులువు



డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులు రైతులకు సులువు. ఈ పద్ధతులతో కూలీల సమస్య, ఖర్చు తగ్గుతుంది. అన్నదాతలకు ఈ విధానాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు తగ్గుతుంది. ఈ పద్ధతితో 20 శాతం యూరియా వాడకం తగ్గుతుంది. దిగుబడి ఆశాజనకంగా దిగుబడి వస్తుంది.

– వెంకటేశం, ఏఓ, షాబాద్



చేవెళ్ల: ఆలయం వద్ద బీఆర్‌ఎస్ నేతలు



చేవెళ్ల: వీరభద్ర కాలనీలో కాంగ్రెస్ నాయకులు

బోనమెత్తిన పల్లెలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనమెత్తి ర్యాలీగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్: మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పూజలు



షాబాద్: చందనవెల్లిలో బోనమెత్తిన మహిళలు

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్

కేశంపేట: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పార్టీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని దేవునిగుడి తండా, చింతకుంటపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ, యూత్ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, రూప్లానాయక్, కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విజయారెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు త్వరలో వీఆర్‌ఎస్



నందిగామ: గిరిజనులకు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి శంకర్

- పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్
- మూడు తండాల నుంచి భారీగా చేరికలు

నందిగామ: బీఆర్‌ఎస్‌కు త్వరలోనే వీఆర్‌ఎస్ తప్పదని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పంచాయతీ నందిగామ అనుబంధ గ్రామాలైన బండకుండ తండా, పెద్దకుంట తండా, మద్యకుంట తండాల వాసులు పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలకు ప్రజలు విసిగిపోయారని వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. గిరిజనబంధుపై ప్రభుత్వం నేటికీ ఎందుకు పెదవి విప్పడం లేదని ప్రశ్నించారు. ప్రజలంతా ఇందిరమ్మ రాజ్యం కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు ఖాయం

షాద్‌నగర్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రిలో కాంగ్రెస్ బీసీ, ఎస్సీ సెల్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బాల్‌రాజ్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ.. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, పేదల సమస్యల తీర్చాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏలూరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిన్న సాయి అమరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్, ఉపాధ్యక్షుడిగా అర్జున్, ప్రధాన కార్యదర్శిగా రాములు, కార్యదర్శిగా మహేశ్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, అరుణ, అంజయ్యగౌడ్, భీమయ్య, యాదయ్య, శివ, ప్రవీణ్, భూపాల్‌రెడ్డి, రమేశ్, మహేశ్, అర్జున్, నాని, వంశీ, రాజశేఖర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: తాళ్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1984-1985 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1984–1985లో, చేవెళ్ల మండల పరిధిలోని గుండాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 1988–89లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు.



మొయినాబాద్‌రూరల్: గురువును సన్మానిస్తున్న గుండాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు